క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆదోని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు జరిగా లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు చెప్పారు.

సచివాలయం ముందు రైల్వే సామగ్రి



గణేకల్‌లో సచివాలయం ముందు ఉంచిన రైల్వే సామగ్రి

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ సచివాలయం ముందు రైల్వేకు సంబంధించిన సామగ్రి నిల్వ చేయడంతో సచివాలయ అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సిన పరిస్థితి. సచివాలయానికి ప్రహరీ ఏర్పాటు చేసి, సచివాలయం ముందు ఎలాంటి వస్తువులు, సామగ్రిని నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

పరామర్శ



విరుపాక్షిరెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి సతీమణి గొల్ల ఆనందమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ శుక్రవారం ఆయన్ను పరామర్శించారు. వారితో పాటు పార్టీ నాయకులు గద్దం అంజి, రాము, గౌరవయ్య తదితరులు ఉన్నారు.


సీపీఐ మహాసభలను విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కర్నూలులో ఆగస్టు 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు శ్రీరాములు, రాజీవ్, బజారి, దాదావలి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ కమాటి అదృశ్యం.. కేసు నమోదు



చాకలి బజారప్ప

ఎమ్మిగనూరు టౌన్: దేవనకొండ మండలం తెర్నెకల్ బీసీ హాస్టల్‌లో కమాటిగా పనిచేస్తున్న ఎమ్మిగనూరుకు చెందిన బజారప్ప వారం రోజులుగా అదృశ్యమయ్యాడు. ఈనెల 10వ తేదీ విధుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన అటు హాస్టల్‌కు ఇటు ఇంటికి రాకపోవడంతో భార్య నాగమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రయ్య తెలిపారు.

21 నుంచి పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

ఎమ్మిగనూరుటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21వ తేదీ నుంచి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో వెళుతున్నట్లు ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు ఇస్మాయిల్, కేసన్న, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికులకు గ్రాట్యుటీ, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, మెడికల్ సెలవులు అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ముకుమ్మడిగా సమ్మెలో వెళుతున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఖాజ, కోర్ బాషా, ఆరీఫ్, పక్కీరప్ప, రాజు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

- ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- సరైన వైద్యమే చేశామంటున్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మకుమార్



మృతిచెందిన అంజి



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఆదోనిఅర్బన్: వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు మృతి చెందాడని మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని రాయనగర్ కాలనీకి చెందిన చిన్నఈరన్న కుమారుడు అంజి (36) కడుపు, ఛాతి నొప్పితో ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యులు లేకపోవడంతో ఆసుపత్రిలో ఉన్న నర్స్ అంజికి ఇన్‌జెక్షన్ ఇవ్వడంతో కొంత ఉపశమనం కలిగింది. దీంతో అంజి ఇంటికెళ్లిపోయాడు. ఇంటికెళ్లిన తరువాత ఆయన పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు మళ్లీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. మృతుడికి భార్య రోజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఓ ఫ్యాక్టరీలో వెల్డింగ్ పని చేసుకుంటూ అంజి జీవనం సాగించేవాడు. పోలీసులు ఆందోళనను అదుపు చేసి, కుటుంబ సభ్యులు, వైద్యులతో చర్చించారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మకుమార్‌ను ప్రశ్నించగా.. సరైన వైద్యమే చేశామని ఆయన తెలిపారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత



సంజీవపురంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

నందవరం: పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, సంజీవపురం గ్రామాల్లో చెత్త సేకరణ, మురుగు కాలువలను ఆయన పరిశీలించారు. అనంతరం నందవరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పల్లెల్లో గ్రామస్తులకు చెత్త నిర్వహణ, సేకరణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మురుగు కాలువలు, నీటి కుంటలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని సూచించారు. సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా తాగునీరు, వీధి దీపాలు, మురుగు కాలువల పరిశుభ్రత, చెత్త సేకరణ వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ పుల్లయ్య, గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వెనుకబడిన కుటుంబాల అభివృద్ధికి కృషి చేద్దాం



వీసీలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్

కోసిగి: ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను గుర్తించి అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ జి.భాస్కర్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇక్కడి నుంచే జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీసీకి ఆయన హాజరయ్యారు. అనంతరం మండల అధికారులతో మాట్లాడారు. మండలంలో వెనుకబడిన 1,454 కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. డి.బెళగల్, చిన్నభూంపల్లి గ్రామాలల్లో పర్యటించి పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ ఈశ్వరయ్య, తహసీల్దార్ వేణుగోపాల్, ఏపీఓ ఖాలిక్ పాల్గొన్నారు.

ముగిసిన బెనకాగురువుల ఆరాధన



పల్లకీ ముందు నందికోలు సేవలో పీఠాధిపతులు, భక్తులు

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన ఘన గురు దత్తాత్రేయ సంప్రదాయ వంశపరంపర గంజెళ్ల వెంకటాగురు శిష్యుడు బెనకాగురువుల ఆరాధనోత్సవం శుక్రవారం ముగిసింది. గంజెళ్ల వెంకటాగురువుల వంశస్తులు కృష్ణమూర్తి స్వామి ఆధ్వర్యంలో ఉదయం బెనకాగురువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పుణ్యగణారాధనలో భాగంగా పల్లకీసేవ, నందికోల సేవను గ్రామ పురవీధులగుండా కనులవిందుగా నిర్వహించారు. అనంతరం గురువుల విచరణ ప్రవచనం, ప్రసాదం, భోజన కార్యక్రమం చేపట్టారు. రాత్రి అఖండ భజనతో మేలుకొలుపు నిర్వహించారు. కార్యక్రమంలో మఠం రంగప్పస్వామి, మఠం శాంతమూర్తిస్వామి, మఠం బ్రహ్మేందస్వామి, మఠం గురుమూర్తిస్వామి పాల్గొన్నారు.

సర్దుబాటు పేరుతో చార్జీల పెంపు తగదు



మాట్లాడుతున్న రామాంజనేయులు

కౌతాళం: సర్దుబాటు పేరుతో కరెంట్ చార్జీల పెంపు తగదని సీపీఎం జిల్లా నాయకుడు రామాంజనేయులు విమర్శించారు. మంత్రాలయం నియోజకవర్గ సీపీఎం కార్యకర్తల రెండురోజుల శిక్షణ తరగతులను శుక్రవారం ఉరుకుందలో ప్రారంభించారు. మొదటి రోజు రామాంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఎన్నికల ముందు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వలసలు నివారించడానికి, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడానికి ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. మండల కార్యదర్శి ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య పెద్దకడబూరు, కోసిగి, మండలల కార్యదర్శులు తిక్కన్న, రాముడు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

పెద్దకడబూరు: వచ్చేనెల 9, 10, 11 తేదీలలో జరగబోయే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి భాస్కర్‌యాదవ్, మండల కార్యదర్శి వీరేష్ కోరారు. స్థానిక బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలను విడుదల చేయాలన్నారు. జిల్లా మహాసభల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు, ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ, నాయకులు మల్లన్న, నాగప్ప, అమ్రేష్, బాషా, నాగన్న, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు(సెంట్రల్): ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీపీటీడీ అవుట్‌సోరింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యాజమాన్యం నిర్ణయించిన మేరకు కాంట్రాక్టర్లు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉంటున్నాయన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం కార్మికులకు రావాల్సిన వేతనాలు ఇవ్వకపోగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కూడా కల్పించడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులకు ఈఎస్ఐ కార్డులను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కోసిగి: మండల కేంద్రంలోని సిద్ధరూడ స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరవుతున్నారని, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆర్థిక సాయం

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో కురువ బెక్కన్న గారి ఈరమ్మ (75) శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కాంట్రాక్టర్ బసవరాజు ద్వారా మట్టి ఖర్చులకు రూ.5 వేలు అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొంపల్లి చిన్నన్న, శివయ్య, ఈరన్న, నాగరాజుగౌడ్..బెక్కన్న గారి ఈరమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

22న మండల మీట్

గోనెగండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు గోనెగండ్ల ఎంపీడీఓ మణిమంజరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ టి. నసురుద్దీన్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.

చెక్కుల పంపిణీ

ఆదోని టౌన్: ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని జబ్బులకు చికిత్స పొంది సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తున్న 37 మందికి రాష్ట్ర ప్రభుత్వం చెక్కులు మంజూరు చేసింది. వాటిని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు శుక్రవారం రూ.17లక్షల విలువైన చెక్కులను బాధితులు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉమాపతినాయుడు, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రామస్వామి, రంగన్న, రంగస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ఆదోని సెంట్రల్: డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లు కోసం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి శుక్రవారం తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరంనకు గానూ ఆఫ్‌లైన్ ద్వారా, నేరుగా కళాశాలలో చేరే అవకాశం ఉందన్నారు. కళాశాలలో బీఏ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్) బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఫీజుతో క్రమశిక్షణ, నాణ్యమైన విద్యను అందించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని పేర్కొన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరదలచిన విద్యార్థులు ఈ నెల 21వ తేదీన విద్యార్హతకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు సెల్ 9866041775,6301008898,9440443724 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

ఆదోని టౌన్: పట్టణంలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8;30 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కార్యక్రమంపై ర్యాలీ చేపడతామన్నారు. ఇందుకు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛతపై ప్రజలకు ర్యాలీలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

ఆటస్థలం ఏర్పాటు చేయాలి

కోసిగి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంల విద్యార్థినులకు ఆట స్థలం కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కేజీబీవీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆట స్థలం లేకపోవడంతో విద్యార్థినులు క్రీడలకు దూరమవుతున్నారని, ప్రభుత్వం స్పందించి ఆట స్థలం కేటాయించాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు సంతోష్, రవి పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

పెద్దకడబూరు: రైతుసేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారిణి సుచరిత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి 13.5 టన్నులు, పెద్దకడబూరుకు 27, దొడ్డిమేకలకు 13.5, గవిగట్టుకు 27.5, పీకలబెట్టకు 13.5, కల్లుకుంటకు 27, జాలవాడికి 13.5, నౌలేకల్లుకు 13.5 చొప్పున మొత్తం 162 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు గుర్తింపు



బుట్టారేణుక, ప్రతుల్‌ను సత్కరిస్తున్న పార్టీ బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు బజారి

ఎమ్మిగనూరుటౌన్: బీసీలకు తగిన గుర్తింపునిచ్చి వారి అభ్యున్నతికి పాటుపడే పార్టీ వైఎస్సార్‌సీపీ అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన వెంకటాపురం కౌన్సిలర్ బోయ బజారి శుక్రవారం రేణుకతో పాటు బుట్టాప్రతుల్, బుట్టా శివనీలకంఠను కలిశారు. వారికి శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కృతజ్ఞత సభకు వారిని ఆహ్వానించారు. తనకు పార్టీలో గుర్తింపునిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బుట్టా రేణుకకు ధన్యవాదాలు తెలిపారు. బీసీల కోసం పాటుపడే వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బుట్టారేణుక సూచించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు పాలశ్రీనివాసరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు పోదాం.. బాబు మోసాలను వివరిద్దాం



మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి



హాజరైన కార్యకర్తలు

కౌతాళం: గడప గడపకు వెళ్లి చంద్రబాబు మోసాలను వివరిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ప్రదీప్‌రెడ్డి మాట్లాడారు. తొలి అడుగు పేరుతో గ్రామాల్లోకి వెళ్తున్న టీడీపీ నాయకులను ప్రజలతో కలిసి ఏడాది కాలంగా చేసిన అభివృద్ధి ఏమిటి అంటూ నిలదీయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చి ఆ తర్వాత విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తెలుగుదేశం పార్టీ చేసిన మోసాలను జనాలకు చూపించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని, ఏ కష్టం వచ్చినా రాంపురంరెడ్డి కుటుంబం ఆదుకోవడానికి ముందు ఉంటుందని భరోసా ఇచ్చారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి ఎవరూ భయపడవద్దన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్న సంగతిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, నాయకులు అమరేష్, బుజ్జిస్వామి, పాల్‌దినకర్, మహబుబ్‌సాబ్, నాగరాజ్‌గౌడ్, అవతారం, మహేందర్‌రెడ్డి, ఏకాంబర్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, చెన్నప్పధని, తోవి నర్సన్న, వెంకటరామిరెడ్డి, మరెగౌడ్, నాగభూషణ్‌గౌడ్, చాగి హనుమంతు, అబ్దుల్‌సమద్, తాహెర్ పాల్గొన్నారు.

నెట్టివేయడంతో వ్యక్తి మృతి



క్లూస్ టీమ్‌తో విచారణ చేస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా తలమారి పంచాయతీలోని మల్కాపురం గ్రామానికి చెందిన దుల్లయ్య (36) ఈనెల 17న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. దుల్లయ్య మృతి పట్ల ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం విచారణ చేపట్టారు. మాధవరం వాసి బలంగా నెట్టివేయడంతోనే దుల్లయ్య మృతి చెందినట్లు తేలింది. మాధవరం గ్రామానికి చెందిన రామకృష్ణ ట్రాక్టర్‌కు ఉన్న మడ్‌గార్డ్ (టైర్ పై ఇనుప రేకు)ను దుల్లయ్య పగలకొట్టడంతో గొడవకు దారి తీసింది. ఆర్టీసీ బస్టాండ్ వైపుగా వస్తున్న దుల్లయ్యతో రామకృష్ణ గొడవ పడ్డాడు. మాటామాటా పెరిగి రామకృష్ణ ఒక్కసారిగా నెట్టివేయడంతో దుల్లయ్య కిందపడ్డాడు. తలకు వెనుక భాగంలో సిమెంట్ రోడ్డు తగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. డీఎస్పీ విచారణలో రామకృష్ణ నిందితుడిగా తేలడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

మౌలిక వసతులు కల్పించండి



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న శివశంకర్‌నగర్, మహాత్మాగాంధీ నగర్ వాసులు

ఆదోని టౌన్: పట్టణంలోని శివశంకర్‌నగర్–మహాత్మాగాంధీనగర్‌లో రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వసతి, పైపులైన్లు, విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు తదితర వసతులను కల్పించాలని ఆయా కాలనీవాసులు భోగేశ్వరరావు, శైలజ, శ్రీదేవి, వరలక్ష్మి, మహాలక్ష్మి, రామాంజనేయులు తదితరులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మురుగు కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఇళ్లల్లోకి చేరుతున్నాయని, అలాగే నీటి నిల్వతో దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. రోడ్డు లేకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఐదేళ్లుగా మౌలిక వసతులు లేక నరకయాతన అనుభవిస్తున్నామని కమిషనర్‌కు వివరించారు.

సముదాయాల నిర్మాణాలు ప్రారంభమయ్యేనా!



పిల్లర్ల దశలో నిలిచిన పనులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వ్యాపారులందరూ ఒక చోట వ్యాపారం చేసుకునేలా వ్యాపార సముదాయలను నిర్మించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గతంలో చర్యలు చేపట్టింది. పట్టణంలోని శ్రీనివాసభవన్ సమీపంలోని పాత బస్టాండు కూడలిలో రూ.33 కోట్లతో నిర్మాణాలు జరిగేలా ప్రణాళిక రూపొందించారు. దీంతో ఆ ప్రాంతంలో వ్యాపారం చేయదలుచుకున్న వారి నుంచి గుడ్‌విల్ తీసుకొని నిర్మాణాలు ప్రారంభించారు. పనులను కూడా వేగంగా చేపట్టి పునాదులు పూర్తి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంచు పనులు కూడా చేయలేదు. నిర్మాణాల కోసం గుడ్‌విల్ ఇచ్చిన వ్యాపారులు ఎప్పుడు నిర్మాణాలు చేపడతారా అని ఎదురుచూస్తున్నారు.

కానిస్టేబుల్ సాహసం

- నదిలో పడిన వ్యక్తిని కాపాడిన రెస్క్యూ టీం



స్పృహతప్పిన కొపూరప్ప

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని తుంగభద్ర నదిలో రచ్చుమర్రి కొపూరప్ప స్నానానికి వెళ్లి ప్రమాదశాత్తూ కాలుజారి పడిపోయాడు. గమనించిన స్థానికులు రిస్క్ టీమ్‌కు సమాచారం అందించడంతో అక్కడే అందుబాటులో ఎస్‌డీఆర్ఎఫ్ కానిస్టేబుల్ మనోహర్ నదిలోకి దూకి కొపూరప్పను కాపాడి ఒడ్డుకు చేర్చాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ శివాంజల్ చేరుకుని అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.